# కౌక్తి మ్యూక్

"ఏం సుబ్బులూ, ఇంకా ముస్తాబవ లేదేం? పేరంటానికి ఇంకా ఎప్పుడొస్తావ్?"

"మా అమ్మ వెళ్ళొద్దంటోంది. ఇంట్లో పనుందిట."

"ఇంట్లో పనా? అంత అర్జెంటు పనేమొచ్చింది, వచ్చేక చేసుకోగూడదూ? పేరంటాని కెళ్ళడంకోసం స్కూలు మానుకుని ఇంటికొచ్చేంకదా ఇదేమిటిప్పుడూ? పిన్నిగారెక్కడున్నారు?"

"వంటింట్లో కాఫీ పెడుతోంది. రా, వెడదాం."

ఇద్దరూ వంటింట్లోకెళ్ళారు. సుబ్బ లే ముందుగా అడిగింది.

"చూడవే అమ్మా, కమలకూడా వచ్చింది పేరంటాని కెళ్ళద్దుత్సే?"

"వెళ్ళడానికేం గాని, తీరా వెళ్ళిందాకా వుండి ఎవరేనా ఏదేనా అంటారు. నువ్వు వెర్రిమొహం వేసుకుని ఇంటికి చక్కా వస్తావు. పెళ్లి నలుగురిలోనూ మాటలు పడే కంటే ఇంటిదగ్గిరే వుంటే నయంకదాని వద్దన్నాను. అంతకంటే మరేంలేదు."

"సుబ్బుల్ని ఎవరూ ఏమీ అనకుండా నే చూస్తానండి, పిన్నిగారూ! పంపించండి సరదాగా వెళ్ళొస్తాము. ఆ మాటకొస్తే క్రిందటిసారి 'నేను పేరంటాని కెళ్ళినపుడు 'పెళ్ళెప్పుడు చేసుకుంటా'వని అందరూ నన్ను అడగడమే. అంతకాదు, ఇంకో అంత అడగనివ్వండి నేను పేరంటాని కెళ్ళడం మానను."

"నీ అంత గుండె దిటవు మా పిల్లకుంటే నేనేం సందేహించకుండా పంపేసేదాన్ని. కాని, సుబ్బులు ఒట్టి అభిమానస్తురాలు. ఎవరేనా పిసరంత ఏదేనా అంటేచాలు ఏడి చేస్తుంది. సరే వెళ్ళిరండి. అది ఏడుపు మొహం వేసు కూర్చుంటే నాకే పనీ తోచదు. ఏదో ఒహాటవుతుంది. ఈ కాఫీ తాగి వెళ్ళండి. మళ్లీ త్వరగా వచ్చెయ్యండి."

"మా పిన్నిగారు మంచివారు. తొరగా బట్టలు కట్టుకురావే సుబ్బులూ, ఆలస్యం చెయ్యకూడదు. ఇప్పటికే పొద్దుపోయింది. చూస్తూండండి పిన్నిగారూ, సుబ్బుల్ని తీసుకొచ్చి ఎలా మీ కప్పచెబుతానో!"

"ఏమో చూద్దాం. నలుగురు పేరంటాళ్లూ దుయ్యబట్టుకుంటే నువ్వేం చెయ్యకలవమ్మా."

సుబ్బులు ముస్తాబై వచ్చింది. ఇద్దరూ బయలుదేరి వెళ్లేరు. వాళ్లు వెళ్లేసరికి చాలా మంది పేరంటాళ్లు వచ్చేరు. ఇంకా వస్తున్నారు. ఇంటావిడ రత్తమ్మగారు వచ్చిన వారిని కుశలప్రశ్నలు వేసి, కూర్చోబెడుతున్నారు. వారమ్మాయిలు పసుపులూ, గంధాలూ రాస్తున్నారు.

"సుబ్బులూ, మీ అమ్మగా రాలేదేం?" ఇంటావిడ రత్తమ్మగారడిగేరు.

"మాఅమ్మకి ఇంట్లో పనుందండీ. అంచేత రాలేదు."

"ఇల్లారావే సుబ్బులూ, ఇక్కడ కూర్చుందుగానీ. మీ రవణక్కెడుందే ఇప్పుడూ?" ఒక ఎరుగున్న పెద్దావిడడిగింది.

**కొంపెల్ల మాణిక్యాంబ**

కాని కమలకి పెద్దాళ్ళతో దగ్గిర కూర్చోవడం ఇష్టంలేదు అందుకనే సుబ్బుల్ని ఇంకో పక్కకిలాగింది. దాంతో పిల్చిన పెద్దావిడకి కోపంవచ్చింది. కసిగా అంది.

"ఈ కాలప్పిల్లలు బొత్తిగానే బరితెగించి పోయేరు."

"మేమింకా బళ్లోనే వున్నావండీ అందుకోసం చాలామందికి మా మీద కోపం కూడాను," అని నవ్వింది కమల. సుబ్బుల్ని తీసుకుని ముందువసారాలోకి వెళ్ళింది. అక్కడా నిండుగానే వున్నారు పేరంటాళ్ళు. ఓ ఖాళీచోటు చూసుకుని కూర్చున్నారు కమలా, సుబ్బులూ. రత్తమ్మగారమ్మాయి పసుపురాస్తోంది.

సుబ్బులు ఎవరెవరు వచ్చేరోనని నాలుగువేపులా కలయచూసింది. హృదయంగతుక్కుమంది! ఎదురుగుండా కూర్చున్న మేష్టారమ్మాయి, తనకేసి చూపించి పక్కమ్మాయితో ఏమిటో గుసగుసలాడుతోంది. అది సుబ్బులుకేం నచ్చలేదు. అమాటే కమలకి చెప్పింది. కమల సుబ్బులుకంటే పెద్దదీ, లోకజ్ఞానం బాగావున్నదీ. విషయం వెంటనే కనిపెట్టేసింది. ఈ ఆడవారి వాగ్ధోరణి కమలకి బాగాతెలుసు. వాళ్లు ఒకళ్లి మీద కన్నెర్రంటే చాలు ఆ మనిషిని చిత్రవధచేసే మాటలు, వినేవారికి అర్థరహితంగానూ, అసలువారి హృదయానికి కత్తిపోటుల్లాగానూ, తగిలేట్టుమాట్లాడగలరు. కమల సుబ్బులు దృష్టిని ఇంకోపక్కకి తిప్పుదామనుకుంది. కాని ఇంతలోనే పక్కావిడ సుబ్బుల్ని పలకరించింది.

"ఏమేయ్ సుబ్బులూ, మీ అక్కెక్కడుంది?" అని.

"మాఅక్క అత్తారింటి ధగ్గిరుందండీ."

"మీ పెద్దక్క కాదు. రవణక్క."

"అదీ అత్తారింటి దగ్గిరేవుందండీ.

"సుబ్బులూ, నా ఫ్రెండు ప్రభ నెరుగుదువే? ఇలారా, అలా ప్రభదగ్గిరకి పోదాం," అని కమల సుబ్బుల్ని తీసుకుని ప్రభదగ్గిర కెళ్లింది. "ఐతే నువ్వూ సెలవు పెట్టేశావన్న మాట స్కూలికి." అంది ప్రభతో.

"ఊఁ స్కూలు రోజూ వుంటేదేగా. పేరంటం ఎపుడేనా వచ్చేదయ్యె" అని చెప్పి మెల్లిగా "ఒష్, నీపక్కనున్నమ్మాయి పేరు సుబ్బులుకదూ? వాళ్లక్క ఎక్కడుందే అని ప్రభ కమల నడిగింది.

'నీకార్ధంలో' అని మనస్సులో అనుకుని పైకి ఇలా అంది

"ఈ అమ్మాయి సుబ్బులే. మొన్న పొయిట్రీ రెసి[illegible] పోటీలలో ఫస్ట్ ప్రైజ్ కొట్టిం[illegible]." ఇంతలో మేష్టారి భార్య సుబ్బుల్ని వాళ్ళక్కెక్కడుందని అడుగుతోంది. సుబ్బులు నీరసంగా సమాధానం చెప్పింది.

కమలకి సుబ్బులుమీదెంతో జాలివేసింది. అందరూ సుబ్బులుమీద పట్టించాకేమిటివాళ? తన పెళ్ళివిషయం ఎవరికీ జ్ఞాపకం వున్నట్టేలేదు. సుబ్బులూ, తనూ ఎక్కడకెళ్ళినా అంతవరకూ వాళ్ళు మాట్లాడుకునే విషయం వదిలేసి, సుబ్బుల్ని వాళ్ళక్కెక్కడుం దనడగడం! ఛీ!

ఇంతలో రత్తమ్మగారు మనవరాల్ని సావిట్లోకి తీసుకొచ్చేరు. లేగిపళ్ళు దొరకలేదుట. సెనగలూ, పువ్వులూ, డబ్బులూ కలిపి పళ్ళెంలో పోసితెచ్చేరు. కుర్చీవేసి పిల్లని కూర్చోపెట్టేరు. పెద్దవాళ్ళంతా లేచి అక్కడికి వెళ్ళేరు. రత్తమ్మగారి పిల్ల అందరికీ అక్షింతలిచ్చింది.

అప్పుడే వచ్చింది కోమట్లకోడలు. "భోగిపళ్ళు పోసేశారాండీ? ఇంట్లోపని తెముల్చుకొచ్చేసరికి ఈకాస్తాడికైంది. అవును గాని

# ★ కాకిమూక ★

సుబ్బులమ్మగారూ, మీ చిన్నక్కగారెక్కడున్నారండీ?"

"అత్తారింటి దగ్గిరుంది." సుబ్బులు సమాధానంలో ఏమీ జీవం లేదు. మొహంలో ఏమీ వుత్సాహం లేదు. పేరంటాని కొచ్చినప్పటినుంచీ ఒకటేసొద. ఊపిరి తిప్పుకో నివ్వడం లేదు.

"అదేమిటండీ, అత్తారింటి దగ్గిరున్నారంటారు? నిన్న పొద్దున్న కాకినాడలో మీ అక్కయ్యగారత్తగారు కనిపించి మీ అక్కయ్యగారు పుట్టింటి దగ్గిరున్నారని చెప్పేరు. ఈవాళ మిమ్మల్నడిగితే అత్తారింటి దగ్గిరున్నారంటారూ."

సుబ్బులు బిక్కమొహం వేసింది, కమల అందుకుని అంది

"బాగుంది నీ వాకబు ఆవిడీవేళే అత్తారింటి కెళ్ళిపోయిందేమో. అయినా, నీకెందుకు ఆవిడెక్కడుందో ఖచ్చితంగా తెలుసుకోవడం?"

"నేనావిడ నడిగితే మధ్యని మీకెందుకింత వుస్సూ? అయినా, ఈవేళ అర్ధవేళ పూటా అత్తారింటి కెళ్ళేరంటే ఎవరేనా నమ్ముతారా?"

సరి! ఈవేళ అష్టమేమిటీ? కమల తమాయించుకుని మెల్లిగా, ఇలాఅంది కోమట్ల కోడలితో.

"సుబ్బమ్మా, నీకోరహస్యం చెప్పనా? ఎవరికీ చెప్పవుకదా?"

"అంత చెప్పకూడనిదైతే ఎవరికైనా ఎందుకు చెబుతానండీ?" అని ఎదురు ప్రశ్నించింది.

"మరైతే విను. రవణమ్మగారికి చిన్నప్పటి నుంచి చదువుకోవాలని మహాసరదా. అత్తారికిష్టం లేదు. ఇంటిదగ్గిరెప్పుడూ చదువుతోనే గడిపింది. ఆవిడ పట్టుదల "మెట్రిక్" పాస వ్వాలని. ఛాలారోజులు ఆలోచించింది. ఆఖరికి మొన్న వాళ్ళమ్మగారితోటీ, నాన్నగారితోటీ చెప్పేసింది.

ఆ పరీక్షకి తనచేత కట్టించమనీ, లేకపోతే తనమీద ఆశ వదులుకోమనీను. దాంతోటి వారికి దారీతెన్నూ తోచలేదు. ఇంతలో వాళ్ళ పెద్దల్లుడొచ్చేడు. అప్పుడు వారు అతనితో మాట్లాడి విశాఖపట్నం వాళ్ళ పెద్దక్కగారింటికి పంపేశారు అక్కడ చదువుతోంది. ఈ విషయం ఇంకా రవణ అత్తారికి తెలియదు.

"అల్లాగాండీ?..."

'అక్షింత లెయ్యండ్రా' అంటున్నారంతా. కొంతమంది వెళ్లి వేస్తున్నారు. సుబ్బులు కమలతో అంది:

"నే నింటి కెళ్ళిపోతున్నానే కమలా! ఇంకా ఎంతమంది తరవాయున్నారో, నన్నడగడానికి? అమ్మమాట విని ఇంటి దగ్గిరుండిపోవలసిందసలు. పోనీలే, నే వెడతా నువ్వు వాయనం పుచ్చుకురా."

"అదేమిటే అడిగి, అడిగి వాళ్లనోరు నొప్పెడుతుంది. చివరికొచ్చేశాం యింక. సెనగలు పుచ్చుకుపోదాం."

"సుబ్బులూ, రవణెక్కడుందిప్పుడూ?" ఎవరో సింగమ్మగారడిగేరు.

"మా...మా..."

"అదేమిటల్లా నసుగుతావు?"

"మా అక్కయ్యగారింటి దగ్గిరుందండీ," అనేసి వీధివేపు చక్కాపోయింది.

"మాకు వాయన మిచ్చెయ్యండి మేమింటికెళ్ళిపోవాలి," అని కమల ఇంటావిడ నడిగింది.

"వెళ్ళిపోదురుగానమ్మా. అంతా వెళ్ళిపోదురుగాని, ఎవ్వరూ ఇక్కడ దిగడద్దు. ఒక్క నిముషం ఆగండి అందరికీ యిచ్చేస్తాం," అదీ ఆవిడ సమాధానం.

సుబ్బులు వీధిలోకొచ్చింది. కళ్లనీళ్ళు తుడిచేసుకుంది. మెట్లు దిగుతోంది. అప్పుడే ఒక ముసలిముత్తైదువ కోటమ్మగారు మెట్లెక్కి వస్తున్నారు.

"పేరంటం అయిపోయిందేమిటి పిల్లా, వెళ్ళిపోతున్నావ్. అవునుగానీ, బుల్లెమ్మా, మీ అక్కెక్కడుందిప్పుడూ?"

"మా అక్క లేచిపోయిందండీ."

"ఆఁ! ఆఁ! ఏమిటి చ్ఛ, చ్ఛ! కలికాలం.. " ఆవిడ లోపలికెళ్ళింది. ఆవిడతోపాటే ఆ వార్తకూడా లోపలికి చేరింది. అందరి చెవులలోకీ పాకింది.

అమ్మయ్య! అనుకుంది సుబ్బులు. ఇంక తనే రహస్యం దాచక్కరలేదు. లోపల కెడతామని సుబ్బులు వెనక్కి తిరిగింది. ఇంతలో కమల వస్తోంది.

"పోనీలేవే, వెళ్ళిపోదాం. వాళ్ళెప్పటికీ సెనగలివ్వడమే లేదూ" అంది కమల.

"ఇంక వెళ్ళక్కర్లేదే వాళ్ళు సెనగలిచ్చేక పుచ్చుకునే వెడదాం."

"ఏమిటూ కులాసా? ఇంకా బోలెడు మంది జనం వస్తున్నారు."

"రానీ, ఎంత మందొచ్చినా నాకేం భయం లేదు నిజం చెప్పేశా. ఇంకా ఎంత మందడిగితే అంత మందికీ చెప్పేస్తా."

"ఏమిటూ నిజం?"

"మా రవణక్క లేచిపోవడం. అది పసిగట్టే వీళ్ళందరూ నన్నిల్లా ఏడిపించేస్తున్నారు. ముఖ్యం - మొహం ఎరగనివాళ్ళు కూడా వచ్చి 'మీ రవణక్కెక్కడుందీ' అనడం"

"ఎప్పుడు జరిగిందిది?"

"నెల్లాళ్ళు దాటిపోయింది కాని, అప్పుడే మా ఈవిషయం నా పెళ్ళయ్యేదాకా ఎవరికీ చెప్పకుండా గుట్టుగా వుంచమంది. అంతే, వీళ్ళలా పసిగట్టేశారో, ఒకటే అడగడం అక్క లేదనే బాధకంటే వీళ్లబాధెక్కువయిపోయింది. ఇంతకీ వాళ్ళకి పాపం తెలవక మా అక్క యోగక్షేమాలు మాత్రమే తెలుసుకుందామని అడుగుతున్నారనుకోకు. వాళ్ళల్లా అడగ్గానే నేను పడే బాధనీ, నా అవక-తవక సమాధానాల్నీ చూసి ఇకిలిద్దామనే! ఇంతవరకూ వాళ్ళ ఆట. ఈ పైన నా ఆట ఈ సారెవరైనా అడగనీ, నేను మా అక్క లేచి పోయిందంటాను. వాళ్ళు తెల్ల మొహం వేస్తారు. ఇంకా ఆముసలావిడ మొహం చూడాల్సింది.'

"అయితే, మీ అమ్మగా[illegible]ప్పుడూ చెప్పేకావనీ?"

"ఊహుఁ. ఎవరు దాచగలరేమిటింక, అందరికీ తెలిసిపోయాక? ఆ మాటకొస్తే ఇప్పుడు దాచడం మన తప్పు. అందరికీ తెల్సిపోయాక, దాచిన కొద్దీ ఏడిపిస్తారు. విన్నావుకదూ, మా అక్క, అత్తగార్ని కూడా విశ్రాంతిగా వుండనివ్వడం లేదు. వాళ్ళ ముందర బుర్రవంచి వప్పుకునేదాకా నానా హింసలూ పెట్టేస్తారు ఒప్పేసుకుంటే మన మీద కొంచెం సానుభూతి చూపించి, ఆ తర్వాత మర్చిపోతారు.

ఆ తర్వాత వాళ్ళు సెనగలు పుచ్చుకుని హాయిగా ఇంటికి చేరుకున్నారు. ★





నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది మేహము, నిశ్శక్తి, విస్మృతువగైరా హరించి బలము రక్తవృద్ధికల్గించును 20 తు. డబ్బి రు 8-4-0 పోస్టేజి రు 1 1-0.

సి. వి. ఎ. అండ్‌కో, (ఆయుర్వేద సమాజం) పెరిదేపి (పోస్టు) — నెల్లూరుజిల్లా



కలవరపడు స్త్రీలకు



"కుమారి" మాత్రలు మరువకండి మీ ఆరోగ్యం రక్షించును చింతఅనవసరం

వెల (సాదా) రు 3/-
(స్పెషల్) రు 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజిప్యాకింగుప్రత్యేకం

Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta 40.

స్టాకిస్టు. Indo Medical supplies

No. 3 Paultappan st. Seven wells
Madras - 1.